క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాలు



కొవ్వూరులో సత్యనారాయణస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రోలుగుంట: అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో మాదిరిగానే గురువారం మండలంలోని పలు గ్రామాల్లో కల్యాణోత్సవాలు జరిగాయి. కొవ్వూరులో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉప సర్పంచ్ అప్పల నాయుడు, ఆంజనేయస్వామి భజన బృంద నిర్వాహకుడు రమణ, నీటి సంఘం అధ్యక్షుడు రమాణాజీ, నానిబాబు, శివాజీ దంపతులు ఈ కల్యాణం జరిపించారు.

వైభవంగా మరిడమ్మ ఉత్సవం

రోలుగుంట: పడాలపాలెం గ్రామంలో గురువారం మరిడమ్మ ఉత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయానికి భక్తులు తరలి వెళ్లి ఆమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ పాచిలి రామకృష్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద బాణసంచా కాల్చారు. చిడతలు, కోలాటం తదితర సంప్రదాయ కార్యక్రమాలతో సందడి చేశారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం



సర్వమంగళాదేవి, రామలింగేశ్వరస్వామి కల్యాణ వేడుక

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో సర్వమంగళాదేవి సమేత రామలింగేశ్వరస్వామి 152వ కల్యాణ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున స్వామివారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా అర్చకులు రాంపల్లి నాగేశ్వరరావు, విశ్వంభర శర్మ, దొంతుకుర్తి సంతోష్ తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. వడ్డాది, కొత్తూరు, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం తదితర గ్రామాలకు చెందిన భక్తులు కల్యాణ వేడుకల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మోదమాంబ సన్నిధిలో ప్రత్యేక పూజలు



ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామస్తుల ఆరాధ్యదైవం మోదమాంబ అమ్మవారి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా తెల్లవారుజాము నుంచి దూపదీప నైవేద్యంతో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నుంచి ఏకాహం నిర్వహించారు. ప్రత్యేక భజనలతో ఆలయం మార్మోగింది.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఫణీంద్ర కుమార్

నర్సీపట్నం: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా జి.ఫణీంద్ర కుమార్ ఎన్నికయ్యారు. ఇప్పటికే ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు పార్టీ నాయకత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో చిరంజీవి, సిబ్బంది

మాకవరపాలెం: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. మండలంలోని లచ్చన్నపాలెం శివారు దాలింపేటలోని సర్వే నంబర్ 46లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి లేఅవుట్ వేసినట్టు ఫిర్యాదు అందిందని వీఆర్వో చిరంజీవి తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఈ భూమిని పరిశీలించి, ఇది ప్రభుత్వ భూమి అని, ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ఇంకుడు గుంత.. ఇదేం చింత!

పాతాళంలో చేరి ప్రమాదకర స్థాయికి చేరుకున్న భూగర్భ జల మట్టాలను పెంపొందించడంతో పాటు ఆరు బయటకు మురుగునీరు వెళ్లి అపరిశుభ్రంగా మారకుండా ఉండేందుకు ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టింది. ఇళ్లల్లో, పార్కుల్లో, రోడ్ల పక్కన, పొలాల వద్ద, గ్రామాల్లో వృథాగా పోయే నీటిని ఒడిసి పట్టుకోవడం కోసం ఇంకుడు గుంతలు తవ్వాలని నిర్ణయించింది. అయితే సరైన ప్రణాళికలతో నిర్మాణాలు చేయకపోవడంతో అవి మురుగునీటితో నిండిపోతున్నాయి. పకడ్బందీగా నిర్మాణాలు చేపడితే పరిస్థితి ఇలా ఉండేది కాదని వాలాబు గిరిజనులు వాపోతున్నారు.



వాలాబులో ఇంకుడు గుంత డ్రమ్ములో పేరుకుపోయిన చెత్తాచెదారం



పాత వాలాబులో మురుగునీటిని బకెట్లతో తోడుకుంటున్న గ్రామస్తులు

- వాలాబులో అసంపూర్తిగా ఇంకుడు గుంతల నిర్మాణ పనులు
- రోజుల తరబడి డ్రమ్‌లలో మురుగునీరు నిల్వ
- మూతలు లేక దోమలకు నిలయంగా మారుతున్న వైనం
- అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అరకొరగా పనులు

దేవరాపల్లి: ఇంటి పరిసరాలలో మురుగునీటి సమస్యను నివారించడంతో పాటు భూగర్భ జలాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు వాలాబు పంచాయతీ పరిధిలోని గిరిజనుల పాలిట శాపంగా మారాయి. వాలాబు పంచాయితీ పరిధిలో 37 వరకు ఇంకుడు గుంతల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నారు. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి సుమారు రూ.6 వేలు చొప్పున నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం గొయ్యి తవ్వి ప్లాస్టిక్ డ్రమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. డ్రమ్ము చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశాన్ని మెటీరియల్‌తో పూడ్చాల్సి ఉంది. ప్లాస్టిక్ డ్రమ్‌లలో చేరిన నీరు భూమిలో ఇంకి పోయేలా డ్రమ్ములకు రంధ్రాలు చేయడంతో పాటు మూతలు సైతం ఏర్పాటు చేయాలి. ఇంటిలో వాడుకనీరు ఇంకుడు గుంతలో చేరేలా పైపు కనెక్షన్ సైతం ఇవ్వాలి. కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తులు మాత్రం ఇవేమి లేకుండా ఇంకుడు గుంతలో డ్రమ్ముకు అరకొరగా రంధ్రాలు చేయడంతో నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేకుండా పోయింది. పనులు సైతం అర్ధాంతరంగా నిలిపి వేయడంతో పరిస్థితి దారుణంగా మారింది. ఇంకుడు గుంతల్లోని డ్రమ్‌లలో మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో దోమలకు నిలయంగా మారాయి. దోమల స్వైర విహారంతో వాలాబు పంచాయతీ పరిధిలోని గిరిజనులు విష జ్వరాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితికి పంచాయతీ పాలక వర్గంతో పాటు అధికారుల పర్యవేక్షణ కొరవడటమే కారణమని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వాలాబు, పాత వాలాబు గ్రామాలలో ఇం కుడు గుంతలు మురుగునీటితో నిండిపోవడంతో గత్యంతరం లేక కొందరు బకెట్లతో తోడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. డ్రమ్ములపై మూతలు లేక పోవడంతో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన సైతం వెదజల్లుతోంది.

డ్రమ్ముపై మూత పెట్టాలి



ఇంటి ముందు ఇంకుడు గుంత కోసం గొయ్యి తవ్వి ప్లాస్టిక్ డ్రమ్మును ఏర్పాటు చేశారు. డ్రమ్ముపై మూత వేయకపోవడంతో ఏ మాత్రం వర్షం కురిసినా నీటితో నిండిపోతుంది. రోజుల తరబడి నీరు ఉండటంతో దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో బకెట్లతో నీటిని తోడుకోవాల్సి వస్తుంది.

– పోడెల భద్రాచలం, పాత వాలాబు గ్రామం

చెత్త పేరుకుపోతోంది..



ఇంకుడు గుంతల కోసం ఏర్పాటు చేసిన డ్రమ్ములు వాడుక నీటితో పాటు చెత్తా చెదారంతో నిండిపోతున్నాయి. దోమలు వ్యాప్తి చెంది పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. ఇంకుడు గుంతల పనులు మధ్యలో ఆపేయడంతోనే ఈ పరిస్థితి దాపరించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– సికుముకుల గంగతల్లి, వాలాబు గ్రామం

ఇంకుడు గుంతల పనుల పూర్తికి చర్యలు



ఇంకుడు గుంతల పనులు అసంపూర్తిగా నిలిచిపోయినట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే పనులు పూర్తి చేసేలా తక్షణమే చర్యలు తీసుకుంటాం. ఇంకుడు గుంతల్లో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ డ్రమ్ములకు మూతలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం.

– వై.రుక్మిణీదేవి, ఏపీవో, ఉపాధి హామీ పథకం, దేవరాపల్లి

అనకాపల్లిలో నేడు ఏపీటీఎఫ్ ధర్నా



కె.కోటపాడు : పాఠశాల వ్యవస్థలో ప్రభుత్వం అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్టు ఫెడరేషన్ మండల శాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. కె.కోటపాడులో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో కొనసాగుతున్న విద్యా వ్యవస్థలో భాగంగా ఒకే తరగతికి ఒకే ఉపాధ్యాయుడు అన్న విధానాన్ని కొనసాగించాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం 1, 2 తరగతులను కూడా హైస్కూళ్లలో విలీనం చేసే చర్యలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విధానం వల్ల పలు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితులు ఉంటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు గ్రామాల్లో అందుబాటులో లేక విద్యార్థుల డ్రాప్ అవుట్స్ పెరుగుతాయన్నారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నర్సరీని పరిశీలించిన కన్జర్వేటర్



నర్సరీని పరిశీలిస్తున్న కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ దివాస్ మైదీస్

నర్సీపట్నం: నర్సీపట్నం అటవీ కలప డిపోలో ఉన్న సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో పెంచుతున్న నర్సరీని విశాఖ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ దివాస్ మైదీస్ గురువారం సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా డీఎఫ్‌వో కార్యాలయాన్ని సందర్శించారు. అటవీ కార్యకలాపాలపై ఆరా తీశారు. అనంతరం అక్కడకు సమీపంలో ఉన్న నర్సరీని పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న పండ్ల జాతి మొక్కలు, పూలు, వివిధ రకాల వృక్షజాతుల గురించి సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్ కన్జర్వేటర్‌కు వివరించారు. ఆయన వెంట డీఎఫ్‌వో ఎం.శామ్యూల్, రేంజర్ లక్ష్మీనర్సు, తదితరులు ఉన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి తగదు

- సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో అక్రమ సోదాలు దారుణం
- పోలీసుల తీరుపై తీవ్రంగా మండిపడ్డ పాత్రికేయ సంఘాలు
- మండల తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత



కె.కోటపాడులో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు



మాడుగులలో తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందిస్తున్న ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యులు

కె.కోటపాడు : సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో అక్రమంగా సోదాలను నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గజ్జి గంగాధర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కుభిరెడ్డి రాధాకృష్ణ అన్నారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సోదాలు నిర్వహించడమే కాకుండా పోలీసులతో ప్రభుత్వం భయపెట్టే చర్యలకు నిరసనగా కె.కోటపాడులో ఏపీయూడబ్ల్యూజే చోడవరం ప్రెస్‌క్లబ్ విలేకరులు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ డి.రమేష్‌బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చోడవరం ప్రెస్‌క్లబ్ మాజీ కార్యవర్గ సభ్యుడు ఎస్.జె.వి.సత్యనారాయణ(సతీష్) మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలిచి ప్రజా వ్యతిరేక వార్తలను నిష్పక్షపాతంగా సాక్షిలో వెలువరిస్తున్న కారణంగానే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పోలీసులతో కక్ష సాధింపు చర్యలు పాల్పడుతోందని ఆరోపించారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా భావించాలని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో ఇటువంటి చర్యలను పాల్పడరాదని ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు నీలి శ్రీనివాసరావు, శరగడం పరమేశ్వరరావు, నంబారు అప్పారావు, పాల్గొన్నారు.

మాడుగుల: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో అక్రమ సోదాలపై జర్నలిస్టులు గురువారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మాడుగుల ప్రెస్‌క్లబ్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రొబ్బా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వంపై వ్యతిరేక వార్తలు రాస్తే మీడియాను బెదిరించే ధోరణి పాలకులకు తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎలూరి సురేష్, సభ్యులు పుట్టా శ్రీనివాసరావు, కుప్పిలి భవానీ శంకర్, కె.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎడిటర్ ఇంట్లో అక్రమ సోదాలు అన్యాయం

మాడుగుల రూరల్: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో అక్రమంగా చొరబడి పోలీసులు సోదాలు నిర్వహించడం అన్యాయమని పలు ప్రజా సంఘాలు, నాయకులు గురువారం విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఒక ప్రముఖ దినపత్రిక ఎడిటర్‌తో దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమని స్థానిక ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, స్థానిక నాయకులు శానాపతి కొండలరావు, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, తదితరులు మండిపడ్డారు.

రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీదేవి, సీఎస్‌డీటీ సాయి

దేవరాపల్లి: కొత్తగా తెల్ల రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ జి.సాయితో కలిసి గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కొత్తగా పెళ్లైన వారు వివాహ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులను జత చేసి అత్తగారింటి వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. పిల్లలను చేర్చడం కోసం జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌ను జత పరిచి స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి 180 రోజుల్లోగా కార్డులో యాడింగ్ చేస్తామన్నారు. రేషన్ కార్డుకు ఆధార్ సీడింగ్‌లో తప్పులు సరి చేసుకోవడం, రేషన్ కార్డులో అడ్రస్ మార్పునకు అవకాశం కల్పించారన్నారు. ఒకే కుటుంబంలో తల్లిదండ్రులతో పాటు వివాహమైన ఇద్దరు కుమారులు ఉంటే వీరిలో ఒక జంట కొత్తగా రేషన్‌కార్డు పొందవచ్చునన్నారు. ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు స్వచ్ఛందంగా తెల్ల రేషన్ కార్డులను తహసీల్దార్ కార్యాలయానికి సరెండర్ చేయాలని సూచించారు.

వైభవంగా మరిడిమాంబ పండగ

చోడవరం: నియోజకవర్గ కేంద్రమైన చోడవరం పట్టణంలో మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం వైభవంగా జరిగింది. పట్టణ వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అంకుపాలెం రోడ్డులో ఉన్న అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వెలమ వీధి నుంచి పట్టణ పురవీధుల మీదుగా మరిడిమాంబ ఆలయం వరకూ భారీ సంఖ్యలో మహిళలు అమ్మవారి ఘటాల ఊరేగింపు చేపట్టారు. మేళతాళాలు, తీన్‌మార్ డబ్బుల మోతలు, నేల వేషాల మధ్య అమ్మవారి ఘటాల ఊరేగింపు కనుల పండుగగా సాగింది. రాత్రికి సినీ, టీవీ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మార్కెట్‌లో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు



తూనికలు-కొలతలపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనురాధ

నర్సీపట్నం: స్థానిక కూరగాయల మార్కెట్‌లో గురువారం లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనురాధ తూకం రాళ్లు, కాటాలను పరిశీలించారు. తూనికల్లో మోసాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని వ్యాపారులను హెచ్చరించారు. తూనికలు–కొలతల మోసాలపై ప్రజలకు కూడా అవగాహన ఉండాలన్నారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా ఎమ్మార్పీ చూసుకోవాలన్నారు. వ్యాపారులు మోసాలకు పాల్పడితే నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చునని ఇన్‌స్పెక్టర్ అనురాధ వినియోగదారులకు సూచించారు. సిబ్బంది బేతిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

నాతవరం: మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గురువారం నాతవరం గ్రామంలో వీధుల్లో పంచాయతీ కార్యదర్శి లాలం శేషుకుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన స్ప్రేయింగ్ పనులను గురువారం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలు శుభ్రం చేసి, తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం ఎస్సీ కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌నాయుడు

నాతవరం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రాజేష్‌నాయుడు సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇటీవల జ్వరాలు వ్యాప్తి చెందడంతో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి పైగా రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కొంత మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్‌నాయుడు మాట్లాడుతూ ఇటీవల అకాల వర్షాల కారణంగా వాతావరణంలో మార్పుతో రోగాలు వ్యాపిస్తున్నాయన్నారు. జ్వరాలు తగ్గేంత వరకు ఎస్సీ కాలనీపై ప్రత్యేక దృష్టి సారించి నిత్యం వైద్య సేవలు అందిస్తామన్నారు.

యూకలిప్టస్ పెంపకంతో అధిక దిగుబడులు



శివరాంపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

బుచ్చెయ్యపేట: యూకలిప్టస్ తోటలు పెంపకం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని శాస్త్రవేత్తలు శైలజా కుర్రా, వి.ప్రసాదరావు తెలిపారు. జాతీయ ఆగ్రో ఫారెస్ట్రీ దినోత్సవం సందర్భంగా రుషిల్ డెకోర్ లిమిటెడ్ సంస్థ ఆర్.శివరాంపురంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూకలిప్టస్ మొక్కలు నాణ్యతతో కూడి మూడు నుంచి ఐదు సంవత్సరాల్లోనే రైతులకు ఆదాయం తెచ్చిపెడతాయన్నారు. అత్యధిక దిగుబడి సాధించిన రైతులు గొలగాని శ్రీను, జి.మోదయ్య, సిహెచ్.రాజారావు, ఎం.రమణబాబు, సిహెచ్.హంసరాజు, కె.సత్యనారాయణ, వై.గణేష్ తదితరులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, బహుమతులు అందించి సత్కరించారు.

శివ, కేశవ ఆలయాల్లో వార్షిక కల్యాణోత్సవాలు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: కొత్తకోటలోని శివ, కేశవ ఆలయాల్లో ఘనంగా వార్షిక కల్యాణోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. శివాలయంలో కొలువైన రాజరాజేశ్వరిదేవి సమేత రాజలింగేశ్వరస్వామికి, కేశవాలయంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామికి ఒకే వేదికపై ఏటా కల్యాణం జరిపిస్తామని ఆలయ అర్చకులు, దేవదాయ శాఖ ఈవో కిర్మణయి తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ముఖ్యఅతిథిగా అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌లు గుమ్ముడి గోవింద, కోట నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కోనాం భూసమస్యలు పరిష్కరించాలని వినతి

చీడికాడ: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కోనాం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లోని భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా దర్బారులో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోనాం పంచాయతీలోని 14 శివారు గ్రామాల్లో 250 మంది రైతులు తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని సాగు చేస్తున్నారన్నారు. అయితే ఆ భూములను తమకు కాకుండా చేసేందుకు పలువురు కుట్రలు పన్నుతున్నారని, దీన్ని అడ్డుకోవాలని కోరారు. అనంతరం చీడికాడ సచివాలయంలో ఎమ్మెల్యే బండారు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో హేమసుందరరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, తహసీల్దార్ లింకన్, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



విద్యార్థుల హోం వర్క్‌ను తనిఖీ చేస్తున్న హెచ్‌ఎం రాము

మాకవరపాలెం: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ మేరకు మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం కె.రాము వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఇచ్చిన హోం వర్క్‌ను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు.

కనుల పండువగా మరిడి మహాలక్ష్మి పండగ



రసవత్తరంగా ఎడ్ల బళ్ల పోటీలు

నర్సీపట్నం: బలిఘట్టంలో కొలువుదీరిన మరిడి మహాలక్ష్మీ అమ్మవారి పండగ గురువారం కనుల పండువగా జరిగింది. మూడేళ్లకొకసారి జరిగే ఈ పండగలో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామస్తులు వేకువజాము నుంచే ఆలయం వద్ద బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.